# గ్రుడ్డి హృదయాలు

"తారక"

రైలు వేగంగా పోతోంది. చల్లగాలి తెరచి వున్న కిటికీలోంచి శరీరాన్ని తాకుతుంటే ఆకలికూడా మరచిపోయి కునుకుపాట్లు పడుతున్నాను. కాని బండి కుదుపువల్లా, మధ్య స్టేషన్లలో ఆగినప్పుడు ఎక్కే ప్రయాణీకుల సందడివల్లా చేతికి తగిలించిన ఇనపగొలుసుల బాధవల్లా సరైన నిద్ర పట్టలేదు. కడుపులో ఆకలి విపరీతంగా వుంది. కళ్ళు మూసుకుని అలాగే కాసేపు కూర్చున్నాను. మళ్లీ కళ్లు తెరచి చూచేసరికి ఎక్కడ ఎక్కాడో ఒక లావాంటి పెద్దమనిషి చుట్ట కాల్చుకుంటూ, నావేపు ఎగాదిగా చూస్తున్నాడు. మనిషి బాగా డబ్బున్నవాడిలా కనిపిస్తున్నాడు. చేతులకు బంగారు మురుగులూ, రవ్వ లుంగరాలూ, కళ్ళకు బంగారు ఫ్రేముజోడూ వున్నాయి. రైలు నడుస్తూనే వుంది. స్టేషను యింకా చాలా దూరమున్నట్లుంది. రైల్లో చాలా మంది నిద్రపోతున్నారు. సరిగా స్థలం దొరకనివాళ్లు కొందరు అలాగే బల్లల్ని ఆనుకొని కునుకుపాట్లు పడుతున్నారు. వున్నట్లుండి ఆ పెద్దమనిషి నా ప్రక్కన కూర్చున్న కానిస్టేబుల్ని "ఎక్కడి కెళ్తున్నారు?" అని అడిగాడు. ముక్తసరిగా జవాబు చెప్పాడు కానిస్టేబులు. "ఏం చేశాడు?" అని మళ్ళీ ప్రశ్న వేశాడా పెదమనిషి.

"జేబు కొట్టాడండి' అని వినయంగా చెప్పి ఈసారి ఒక పొగాకు కాడ అడిగి పుచ్చుకున్నాడు కానిస్టేబులు.

"జేబు కొట్టాడా...!" అని ఆశ్చర్యంగా అడిగి ఒకసారి తన జేబు చూసుకున్నాడు. జేబు చాలా ఎత్తుగా వుంది. కాసేపాగి మళ్లీ అన్నాడు.

"ఎంత కొట్టేశాడు?"

"అయిదు వందలు."

"అబ్బా! ఎలా దొరికాడు?"

"జేబు కత్తిరించేశాడండి. పర్సులో కొంత చిల్లర కూడా వుంది. అది కొంచం గలగలమనేసరికి పట్టుకుని నలుగురు తన్నారండి."

ఆ పెద్దమనిషి అంతా విని జాలిగా పెదవి చప్పరించి "కొట్టనూ కొట్టారు-జైల్లోనూ పెడ్తున్నారు" అని నా వంక జూసి "నీకు తల్లీతండ్రీ వున్నారుట్రా?" అని అడిగాడు.

"లేరు" అన్నాను.

"అందువల్లనే యింతగా చెడిపోయావు" అన్నాడు. మళ్లీ కాసేపాగి "పట్టుమని పదిహేనేళ్లు లేవు. నీకీ జేబులు కొట్టటం ఎవరు నేర్పారురా? "దొంగతనంచేసి సంపాదించినదాంతో ఎన్నాళ్ళు కడుపు నిండుతుందిరా?" అని అడిగాడు.

నేనేం మాట్లాడలేదు. ఒక నిమిషం ఆగి మళ్లీ "అందరూ జేబులు కొట్టే బ్రతుకుతున్నారా? కాయకష్టం చేసుకుని ఎందరు బ్రతకటములేదు?" అన్నాడు.

"ఎవరిస్తారుబాబూ, మాకుపని? 'జేబులు కొట్టేవాడికి నీకెందుకురా పని' అంటారండి!

"నిజమే బాబు, ఎవరిస్తారు పనివాళ్ళకి?" అన్నాడు కానిస్టేబులు కూడా.

"ఎవరూ ఎందుకివ్వరూ? నీతిగా బ్రతుకుతానంటే నేనిస్తాను. నాదగ్గరకు రమ్మను" అన్నాడు ఆ పెద్దమనిషి. నేను నమ్మలేకపోయాను ఆయన అలా అంటాడని తరువాత ఎక్కువగా సంభాషణ జరగలేదు పెట్టెలోకి మిలిటరీవాళ్ళు ఎక్కారు. పడుకున్నవాళ్లిద్దర్ని లేపుతున్నారు. గలభా ఎక్కువయింది. ఇంతలోకే ఏదో స్టేషన్ దగ్గరకొస్తున్నట్లుండి, రైలువేగం తగ్గింది. పెద్దమనిషి కింద చెప్పులు తడుముకుంటున్నాడు కాళ్లతో. కానిస్టేబులు "బాబూ దిగుతున్నారా?" అని అడిగాడు.

"అవును, ఇదే మావూరు, కొండపల్లి" అని ఆయన లేచి నిలబడ్డాడు. స్టేషను వచ్చింది. ఆయన దిగి వెళ్లిపోయాడు. ఆయన అన్న ముక్కలే నా చెవుల్లో గింగురుమంటున్నాయి "నిజాయతీగా బ్రతుకుతానంటే నీనిస్తాను నాదగరకు రమ్మను" నేనసలు యింతవరకూ ఆసంగతే ఆలోచించలేదు. నిజమే ఎవరిదగ్గరన్నా యింతచాకిరి చేసుకుంటే పొటగడవదూ! దొంగతనంచేసి పట్టుబడి చావుదెబ్బలు తినటంకన్నా అది బాగాలేదూ...? ఆ పెద్దమనిషి అడిగినప్పుడు "ఎవ్వరూ పనివ్వలేదని" అబద్ధం ఆడేశాను. కాని నిజంగా నేనసలెక్కడా అడగలేదు. ఇప్పుడాయ నామాట అన్నాక నాకు ఏడుపొచ్చింది. యిన్నాళ్ళూ దొంగతనం ఎందుకు చేశానా అని. కష్టపడితే నా ఒక్క పొట్ట నిండకపోయిందా? అనుకున్నాను.

అయిదు నెల్లు శిక్ష పడింది ఆ అయిదు నెలూ అయిదేళ్లుగా గడిచాయి జైల్లో వుండగానే మేము జేబులు కొత్త కొత్త రకాలుగా కత్తిరించడం నేర్చుకుంటాం. కాని నేనీసారి సోమరిగా కాలం అంతా వృథాగా గడిపాను.

శిక్ష అయిపోగానే సరాసరి కొండపల్లి వెళ్ళాను జైల్లోకూడా ఆ వూరు పేరు మర్చిపోకుండా ఒక రాయి తీసుకుని జైలు గోడమీద గీసుకున్నాను రెండురోజులు తిరిగాక నాకా పెద్దమనిషి ఒక కాఫీహోటల్లో కనిపించాడు. ఆయన బైటకు వచ్చేదాకా రోడ్డుమీద నిలుచున్నాను. బైటకు రాగానే "అయ్యా! నమస్కారం!" అన్నాను. ఆయన నావంక ఎగాదిగా చూసి "ఓ నువ్వా!" అన్నాడు. "చిత్తం, తమరు పని చూపిస్తామన్నారు. వచ్చాను" అన్నాను.

"ఏం పని?" అన్నాడు.

"నిజాయితీగా బతికితే తమరు పని ఇస్తామన్నారు. గంపెడాశతో వచ్చాను. మళ్లీ దొంగతనం చెయ్యదల్చుకోలేదు." అన్నాను. ఆయన నవ్వి "ఎంతకాలం యీ వైరాగ్యం?.. కుక్క దాలిగుంటలో వున్నంతసేపే" అన్నాడు

"కాదండీ కష్టంచేసుకు బ్రతుకుతాను" అన్నాను.

"ఎవరిస్తారు నీకు పని? దొంగతనం చేసేవాడ్ని ఎవరన్నా పనిలో పెట్టుకుంటారా?" అన్నాడు.

"తమరు పెట్టుకుంటామన్నారు"

"ఏమో అప్పుడన్నానేమో, ఇప్పుడైతే ఏం ఖాళీలేవు నా దగ్గర. బి. ఏ. లు చదువుకున్నవాళ్లే వుద్యోగాల్లేక చస్తూంటే, నీకు పనెక్కడ దొరుకుతుందిరా" అన్నాడు.

"అయితే, నన్నేం చేయమంటారు" అని అడిగాను. "ఫో...మళ్లీ దొంగతనం చేసుకు బ్రతుకు...అంతే!" అన్నాడు

నాకు ఆయన్నేమనాలో తోచలేదు.

ఆయనమాటలు నమ్మి జైల్లో వృథాగా గడిపాను కదాఅని విచారించాను. అక్కణ్ణించి పరాసరి మళ్లీ యీ బస్తీ వచ్చేశాను, మామూలుగా పోలీసువాళ్లపాగా నామీద తిప్ప లేదు.

"జైల్లోనుంచి విడుదలయాక ఎక్కడికి పోయావురా?" అని అడిగారు.

"నిజాయితీగా బ్రతుకుదామని నౌఖరీ కోసం వెతుకున్నాను బాబూ!" అన్నాను, వాళ్లు నవ్వి ఊరుకున్నారు.

మళ్ళీ ఒక రోజున జేబుకొట్టాను పార్కర్ పెన్ను, కాని తేలికగా పట్టుబడి పోయాను. చాలా రోజుల్నుంచి అభ్యాసం లేకపోవటం మూలాన నావేళ్లు బండబారి పోయి వున్నాయి. చావు దెబ్బలు కొట్టి విడిచి పెట్టారు. కాని యీ సారి నన్ను జైలుకు పంపలేదు. ఆ పెన్ను గలాయన నన్ను కొట్టిన దెబ్బలకు జాలిపడి అయిదు రూపాయలు నాకిచ్చి, "ఇంకెప్పుడు దొంగతనం చేయకు" అన్నాడు. దొంగతనం చేసినందుకు నాకిదే మొదటి బహుమానం. తరువాత కొన్నాళ్లవరకూ దొంగతనం చేయలేదు. అలా పట్టుబడ్డాక నా మీద నాకే విశ్వాసం పోయింది. చివరకు ఒక నిశ్చయానికి వచ్చాను. ఒక్కసారిగా మాత్రం ఏదో పెద్ద దొంగతనం చేయాలి. దాంతో జీవనం కొన్నాళ్ళవరకూ గడపాలి. తరువాత సంగతి ఆలోచిద్దాం అనుకున్నాను. ఈ నిశ్చయానికి వచ్చాక నా ఆఖరుసారి దొంగతనంకోసం నాతోటి జేబుదొంగలదగ్గర కెళ్ళి అభ్యాసం మొదలు పెట్టాను. మూడు నెలల సాధనతో మళ్ళీ మామూలువాణ్ణయాను. జేబులు కొట్టే పద్ధతులు ఎప్పటికప్పుడు మారుతుంటాయి! అన్నీ నేర్చుకున్నాను. పగలంతా బస్సు సాండు దగ్గరా, మీటింగులు జరిగేచోటా రైలు'సేషన్లలో తిరిగేవాణ్ణి. రాత్రి ఏ పార్కులోనో పడుకునేవాడ్ని.

నేను వేచి వున్న సమయం వచ్చింది. ఆ రోజు ఆదివారం, సాయంత్రం చీకటి పడుతోంది. బస్సు స్టాండు దగ్గరనుంచున్నాను. ఒక వృద్ధుడు బస్సు కోసం నిలబడి వున్నాడు. నేనూ ఆయన వెనుక చేరాను. జనం చాలామంది వున్నారు. ఆయన జేబులో పొడుగాటి పర్సు బైటికి తొంగిచూస్తోంది. కనీసం రెండు, మూడు వందలన్నా వుండక పోతుందా అనుకున్నాను. బస్సు వచ్చింది. ఒకర్నొకరు తోసుకుంటున్నారు. ఆవృద్ధుని పర్సు కొట్టేశాను. ఆయన్ని తోసుకొని బస్సులో ఎక్కాను. ఆ రద్దీలో ఆవృద్ధుడు ఎక్కలేకపోయాడు. ఆయన జేబు ఎక్కడ వెతుక్కుంటాడో నని నా కళ్ళన్నీ ఆయన మీదే వున్నాయి. బస్సు మలుపు తిరుగుతుండగా ఆయన జేబు మాసుకుంటున్నాడు. ఇంక నా పని అయిపోయిం దనుకున్నాను. బస్సు స్టాండు కెదురుగా పోలీసుస్టేషనుంది. ట్రాఫిక్ పోలీసు నన్నక్కడే చూచాడు కూడాను. వెంటనే టెలిఫోన్ వెళ్తుంది. ఇంక ఆలోచించేందుకు సమయం దొరకలేదు. బండి అడ్డంకొస్తే బస్సు వేగం తగ్గింది. వెనక ఈలలు వినపడుతున్నాయి...దూకేశాను...సందుల గొందుల్లోంచి పోతున్నాను. నేను దిగిన బస్సుకదిలినశబ్దం మళ్ళీ నాకు వినిపించలేదు. పోలీసులు బస్సు ఆపినట్లు గ్రహించాను. ఇంక కొద్దిసేపట్లో నన్ను పట్టుకుంటారు. నాకేమీ తోచలేదు. నా ఆశలన్నీ భగ్నమయ్యేటట్లున్నాయి. నాకు మళ్లీ జైలుతప్పదు. అంత కష్టపడి సంపాదించిన డబ్బు మళ్లీ పోలీసుల చేతిలో పెట్టదల్చుకోలేదు. మలుపు తిరుగుతుండగా గుడ్డిపిల్లవు నువ్వు కనిపించావు. నువ్వా మలుపులో కూర్చుని అడుక్కోటం చాలా సార్లు చూశాను. అప్పుడు అక్కడ ఎక్కువ జనసంచారం కూడా లేదు. తళుక్కున నాకో ఆలోచన తట్టింది. వెంటనే పర్సుతీసి వంగినట్లువంగి, నీచంకకున్న సంచిలో వేశాను. సందుమూల ఒకబీడీ దుకాణముంటే దానిదగ్గర బీడీ కాల్చుకుంటున్నట్లుగా ఆగి చూస్తున్నాను. పోలీసులు వెళ్ళిపోగానే నీ దగ్గర్నుంచి ఆపర్సుని తీసుకెళ్ళి పోవచ్చు కదా అని ఆ సందులోంచి నేను కదల్లేదు. అదే పొరపాటయింది.

పోలీసులు నన్ను పట్టుకున్నారు. ఎన్ని కొట్టినా తియ్యలేదన్నాను. కొట్టి అప్పుడు విడిచి పెడతారనుకున్నాను. కాని అలా జరగలేదు. తన పర్సులో మూడు వేల రూపాయలున్నా యని ముసలాయన చెప్పాట్ట. నేను నమ్మలేక పోయాను. మూడు వేల రూపాయలతో నాజీవితమంతా గడిచిపోతుంది. అంతడబ్బుని నే నెవరో తెలియని ఒక గుడ్డిపిల్ల సంచిలో వేసినందుకు నన్ను నేను నిందించుకున్నాను. కనీసం ఆ పిల్లకు చెప్పనన్నా చెప్పపోతినే అని విచారించాను. ఇంకా ఆ డబ్బు నాకు దక్కదని నిర్ధారించుకున్నాను.

నాకీసారి, నేరం రుజువుకానందుకు అనుమానంమీద ఆరునెలలు కఠినశిక్ష వేశారు. ప్రభుత్వం ఒక చిన్న దొంగతనానికి మాకు యింత పెద్ద శిక్షలు ఎందుకు వేస్తారో తెలియదు. బ్లాకు మార్కెట్టులో ఒక్కసారి లక్షలు సంపాదించే పెద్దలకే శిక్ష లేదు...

ఈ సారి జైలుజీవితము మరీ దుర్భరమై పోయింది. ఎన్ని రోజులు శిక్ష గడిచిందో యింకా ఎన్నాళ్ళుందో కూడా నేను ఎంచుకోటం లేదు. నాతోటి జేబుదొంగలు మళ్ళీ కొత్త మెలకువలు నేర్చుకుందామని నన్ను ప్రోత్సాహపరచేవారు. కాని


నిగనిగలాడు దీర కుంతలాలు పెరుగుటకు



కేశవర్ధని వాడండి.

తలలో దురదను, కురుపులను మాన్పండి వెంట్రుకలు రాలుట ఆపండి కేశాలను అకాలంలో నెరియనివ్వకండి నెరియటం ఆలశ్యం కానివ్వండి. నిగనిగలాడు పొడుగైన కుంతలాలు పొందండి.




కేశవర్ధని వాడి, మీ కేశ సౌందర్య శోభ ప్రదర్శించండి

షాంపూ వాడి, కేశశుభ్రత, సువాసన పొందండి

కేశవర్ధని అ. 14, షాంపూ అ 14, పోస్టేజి అదనం అన్నిచోట్లాలభించును

కేశవర్ధని ప్రొడక్ట్సు, కోయంబత్తూరు.

నేషనల్ సేల్సు సర్వీసెస్ (సదరన్) లిమిటెడ్, బకింగ్‌హాంపేట, బెజవాడ. No 6

# ★ గుడ్డిహృదయాలు ★

నాలో ఉత్సాహం నశించింది. నా జీవితం ఎలాగడపాలో నాకే తెలియదు.

చివరకు నన్ను విడుదల చేశారు. ఈ జైల్లోంచి విడుదలైనాక నాకో గమ్యస్థానమంటూ లేకుండా పోయింది. కాని కాళ్లు మళ్ళీ యిక్కడికే యీడ్చుకొచ్చాయి.

జైల్లో నా ఆరోగ్యం చాలా చెడిపోయింది. దగ్గు వస్తోంది. అప్పుడప్పుడు చలి జ్వరం వచ్చేది. నువ్వు మళ్ళీ నాకు కనిపిస్తావన్న ఆశ వదులుకున్నాను. ఆ డబ్బు అందగానే నువ్వూ, నీతోటి వారు ఎక్కడికో పరారయివుంటారనుకున్నాను. అందువల్ల నిన్ను గురించి వెతకదల్చుకోలేదు.

ఈవూరు వచ్చాక మళ్ళీ జ్వరపడ్డాను. పదిహేను రోజులు. జైల్లో సంపాయించుకున్న డబ్బుల్లో మందుతీసుకున్నాను. ఇవ్వాళ కాస్త జ్వరం నెమ్మదించింది. మనస్సులో ఏదో ఆందోళన బయలుదేరింది. ఇంకా నువ్వు సందు మొదట్లోనే వున్నావేమోనని. నువ్వు సందు మొదట్లోనే వున్నావు. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. కుదిరింది. నువ్వు గుడ్డిపిల్లవు నీకు. కళ్ళు కనిపించవు. కళ్ళు లేకపోయినా, నీకు హృదయం వుంది. అయితే ఆపర్సు నీదగ్గరే వుందా?

"నాదగ్గరే వుంది?"

"నిజంగానా!"

"అవును నాగుండెల్లో దాచుకున్నాను. ఇక్కడ తీస్తే నలుగురూ చూస్తారు. అవతలకు పోయాక యిస్తాను. నాకివాళ చాలా సంతోషంగా వుంది."

"ఎందుకు?"

"ఇన్నాళ్ళకు నా రొమ్ములమీద బరువు దింపుకుంటున్నాను. ఆరోజు ఎవరో ఏదో వస్తువు నా సంచిలో పడవేశారు. ఏమిటా అని తడిమి చూసుకున్నాను. పర్సులోపల ఏముందో విప్పి చూడలేదు. ఈ డబ్బుసంచి ఎవరు వేశారో మళ్ళీ నాకేవచ్చి తీసుకుపోతారనుకున్నాను. ఎవరికీ తెలవకుండా కాపాడుతూ వచ్చాను. ఇన్నాళ్ళకు నీవు వచ్చావు."

"నువ్వు దాంట్లో ఏమీ ఖర్చు పెట్టుకోలా?"

"లేదు; చాలాసార్లు ఆబుద్ధి పుట్టింది. కాని అపని చేయలేదు. ఒకరి సొమ్ముకు నే నాశపడలేదు. ఈ మధ్య నా అన్నకు పెద్దజబ్బు చేసింది. అతనొక్కడే నాకాధారం. చచ్చిపోతాడనుకున్నాను. అప్పుడుకూడా నేను తియ్యలేదు. ఆ డబ్బసలు నాదగ్గరలేదనే అనుకున్నాను. నా అన్న బ్రతికాడు."

"నిజంగా ఆ పర్సు నీదగ్గరేవుందా?"

"ఆ! ఏం నామాటమీద నీకు నమ్మకం కలగలేదా...యిదిగో చూడు!"

"ఆ! యిదే!...అవును...... నీదగ్గరే వుంచు. అప్పుడే యివ్వకు......పోలీసులు నన్ను మళ్ళీ పట్టుకుంటారు......తరువాత తీసుకుంటా." "వద్దు. నేనీ బరువు మోయలేను. నీవస్తువు నీవు తీసుకెళ్ళు."

"బరువా యిది నీకు?"

"బరువుకాదూ...! ఇంకొకరి వస్తువు బరువుకాదా?"

"ఈ డబ్బుతీసుకుని మనిద్దరం యింకో ఊరుపోదాం వస్తావా? నాకూ నా అన్నవారెవ్వరూ లేరు."

"రాను."

"నాకొకందుకు ఆశ్చర్యం వేస్తోంది. గుడ్డిపిల్లవు, యింకొకరి ఆధారంలేకుండా బతకలేవు. అలాంటిదానివి నీదగ్గర యింత డబ్బుండికూడ దాంట్లో ఒక దమ్మిడీఅన్నా వాడుకోకుండా ఎలావుండగలిగావు? చివరకు నీ జీవితానికి ఆధారమైన నీ అన్నకు జబ్బుచేసినప్పుడుకూడా నీకందులోంచితీసి ఖర్చుపెట్టుకోవాలని అనిపించలేదా?"

"అనిపించింది. కాని ఆ కోరికను అణచుకున్నాను. ఇతరులెవరికో చెందిన యీడబ్బు పెట్టి మా అన్నకు మందిప్పిస్తే మా అన్న బ్రతకడేమోనని భయమేసింది. అదీగాక యీ ధనం యెవరిదో నాకీనాటికి కూడ అంతు తెలియలేదు. భగవంతుడే నన్ను పరీక్ష చేయటానికని యీ విధంగా నాకు డబ్బుపంపి, మా అన్నకు వ్యాధిని సంక్రమింపచేశాడనుకున్నాను. నేను పరీక్షలో నెగ్గాను. చచ్చిపోతాడనుకున్న మా అన్న బ్రతికాడు. ఈ డబ్బు ఎవరికి చెందిందో వారికి తిరిగి యివ్వగలిగినందుకు నా మనస్సెంతో సంతోషంగా వుంది. 'లక్ష్మి' అనేది చంచలమైనది. ఇవాళ యిక్కడుంటుంది. రేపు ఎక్కడికో వెళ్ళిపోతుంది. కాని సంతృప్తనేది బ్రతికినన్నాళ్ళు నిలిచిపోతుంది."

"నిజమే! డబ్బు స్థిరమైనది కాదు. సంతృప్తే శాశ్వతం. ఈ నిజం నాకీనాడు తెలిసింది. ఇప్పుడే వస్తాను. ...యిక్కడే వుండు...ఏకీ...ఆ పర్సు యిటు తే..."

"ఏం చేస్తావు?"

"ఇది ఎవరిసొమ్మో వారికి అప్పచెప్పి వస్తాను. ఇంతకన్నా జీవితంలో చేయతగ్గ మహాత్కార్యంలేదు. దీనివల్ల మంచిపని ఒకటైనా చేయగలుగుతున్నాను గదాయని సంతృప్తి, నూతనోత్సాహం నాకు కలుగుతున్నాయి. నేనిప్పుడే తిరిగివస్తాను. మనిద్దరం కలిసి ఎక్కడికేనా వెళ్ళిపోదాం. కొత్తజీవితం ప్రారంభిద్దాం. జీవితంమీద ఆశ, బతకగలనునే ధైర్యం నాకీనాడు చేకూరింది. నా గుడ్డిహృదయానికి నీవు జ్ఞాననేత్రాలిచ్చావు." ★




చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధులన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, వివిధ క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చుటలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధి చెందినది.

"రమణీస్ బెబి గ్రైప్"




తయారుచేయువారు

దిసౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు

సీతారాము జనరల్ స్టోర్సు ఏజెన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.